సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



అడ్డగోలు ఆందోళనలు

కూటమి నేతలు అడ్డగోలు ఆందోళనలకు తెరతీశారు. మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిపై అసత్య ఆరోపణలు చేస్తూ ఆయన ఇంటి వద్ద నిరసనకు దిగారు. 8లో ▸



షష్ఠి సంబరం

సుబ్బారాయుడి షష్ఠి మహోత్సవాలు శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఘనంగా జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 8లో ▸



చట్టాలపై అవగాహన తప్పనిసరి

చట్టాలు, శిక్షలపై అవగాహన పెంచుకోవాలని ఒంగోలు సెషన్స్ కోర్టు జడ్జి దున్న రాములు అన్నారు. కథోలిక న్యాయవాదుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

రైతులను మోసగించిన కూటమి ప్రభుత్వం



గోటేరులో రైతులతో మాట్లాడుతున్న కారుమూరి

ఇరగవరం: ధాన్యంలో తేమ శాతం తగ్గించుకోవడానికి అన్నదాతలు పడుతున్న పాట్లు వర్ణనాతీతమని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇరగవరం మండలంలోని గోటేరు గ్రామంలో కారుమూరి పర్యటించి రైతులతో మాట్లాడారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పని చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. తుఫాన్‌తో పంటకు నష్టం వాటిల్లుతుందని ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ బీమా పథకానికి ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించేదన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు సుబ్బరాజు, నాగార్జున, ఎంపీటీసీ సభ్యుడు పాలా పాలేశ్వరరావు పాల్గొన్నారు.

యువతలో సృజనాత్మకత వెలికితీయాలి

నరసాపురం: యువతలో సృతజత్మాకత వెలికతీసేలా విద్యాసంస్థల్లో తరచూ పలు కార్యక్రమాలు జరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం వైఎన్ కళాశాలలో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా యువ ఉత్సవ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకానందుడిని స్మరించుకుంటూ జిల్లా యువ ఉత్సవ్‌ను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సృజనాత్మకతను వెలికితీస్తాయని చెప్పారు. యువత ఏదో ఒక అంశంలో ప్రయత్నం చేస్తే విజయాలు వస్తాయన్నారు. వివిధ నృత్యపోటీల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అంతకుముందు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీలు తయారు చేసిన వివిధ వస్తువుల స్టాల్స్‌ను, సైన్స్ విజ్ఞాన పరికరాల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసి రాజు, జిల్లా యువజన అధికారి దూలం కిషోర్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, నరసాపురం డీఎస్పీ డి.శ్రీవేద, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు పాల్గొన్నారు.

సైనికుల సంక్షేమానికి అండగా నిలవాలి



ఎన్‌సీసీ విద్యార్థులతో కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): ఫ్లాగ్ డే ఫండ్‌ను విరివిగా అందజేసి దేశ రక్షణలో బాసటగా నిలుస్తున్న సైనికుల సంక్షేమానికి అండగా నిలవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. డిసెంబర్ 7 ఫ్లాగ్ డే సందర్భంగా శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఫ్లాగ్ డే ఫండ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, వ్యాపారవేత్తలు, వివిధ వర్గాల నుంచి ఫ్లాగ్ డే స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్ అమ్మకం ద్వారా సేకరించిన మొత్తాన్ని సైనిక సంక్షేమ నిధికి జమ చేస్తారన్నారు. డీఎన్నార్ కాలేజ్ ఫ్లాగ్ డే ఫండ్ రూ.23,764 చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు అందజేశారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు

ఏలూరు (టూటౌన్): కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు దోహద పడతాయని 7వ అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో స్థానిక న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి ఎం. రామకృష్ణంరాజు మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితిగతిన పరిష్కారానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా ఈ కేంద్రాల్లో కేసుల పరిష్కారంపై న్యాయవాదులకు అవగాహన కలిగించారు. కక్షిదారులకు అవగాహన కలిపించి, మధ్యవర్తిత్వానికి సహకరించేలా అవగాహన కల్పించాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

మీ ఆర్డర్.. వచ్చిందండీ..



బ్యాగు నిండా పార్శిళ్లతో.. ఇప్పుడు ఎక్కడ చూసినా డెలివరీ బాయ్‌లే. పగలనక రేయనకా, ఎండనక వాననక కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లు బైక్‌లు, స్కూటర్లపై రయ్ రయ్ మంటూ ఉరుకులు పరుగులు పెడుతూ కనిపిస్తున్నారు. వస్తువులు, ఆహారాన్ని ఆర్డర్ పెట్టిన వారి చెంతకు చేరుస్తూ సేవలందిస్తున్నారు.

- పెరిగిన ఆన్‌లైన్ బిజినెస్
- ఈ కామర్స్ నుంచి ఫుడ్ వరకు ఆన్‌లైన్‌లోనే ఆర్డర్లు
- డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు పెరిగిన ఆదరణ
- జిల్లాలో ఏడు వేల మంది వరకు డెలివరీ బాయ్స్
- నెలకు రూ. 17 వేల నుంచి 20 వేలకు పైనే సంపాదన

సండే స్పెషల్



కాలంతో పోటీపడుతూ

పార్శిల్ డెలివరీ చేస్తేనే డెలివరీ బాయ్స్‌కు కమీషన్ వస్తుంది. అందుకయ్యే బైక్ మెయింటెనెన్స్, పెట్రోల్ ఖర్చులను వీరే భరించాలి. ట్రాఫిక్ ఉన్నా, గుంతల రోడ్డైనా కాలంతో పోటీ పడుతూ నిర్ణీత సమయానికి ఆర్డర్ కస్టమర్లకు డెలివరీ ఇవ్వడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటారు. ట్రైన్‌లో ఉన్నా ఆర్డర్ చెంతకు చేరుస్తారు. ఒక్కోసారి తప్పుగా ఇచ్చిన అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లతో ఆచూకీ తెలియక ఇబ్బందులు పడుతుంటారు. ఆర్డర్ పెట్టిన వస్తువులు సరిగా లేదనో, చెప్పిన సమయానికి రాలేదనో కస్టమర్ల చీత్కారాలకు చిరునవ్వుతో బదులిస్తూనే సాగిపోతుంటారు.



సాక్షి, భీమవరం: ఇటీవల కాలంలో ఆన్‌లైన్ బిజినెస్ పెరిగింది. ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్, క్లాత్, రెడీమేడ్, టూల్స్, హోమ్ నీడ్స్, మెడికల్, కిరాణా, ఫర్నీచర్ తదితర వివిధ రకాల వస్తువుల నుంచి ఫుడ్ ఐటమ్స్ వరకు అన్నీ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగానే వస్తువులను డోర్ డెలివరీ సేవలందించే ఈ కార్ట్, డెలివరీ, అమెజాన్, షాడోఫెక్స్, ఈ.కామ్ ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బీస్, బ్లూడార్ట్, వాల్మో తదితర ఈ-కామర్స్ సంస్థలు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. భీమవరం పట్టణంలోనే ఈ-కార్ట్ బ్రాంచీలు మూడు వరకు ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, భీమవరం, నరసాపురం, ఆకివీడు తదితర పట్టణాలతో పాటు పలు మండల కేంద్రాల్లోను తమ బ్రాంచ్‌లు ఏర్పాటుచేశాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా సంస్థలకు చెందిన బ్రాంచ్‌లు 80కు పైనే ఉన్నాయి.

డెలివరీ బాయ్స్‌కు డిమాండ్

ఆన్‌లైన్ ఆర్డర్లు పెరగడంతో డెలివరీ బాయ్స్‌కు డిమాండ్ ఏర్పడింది. పార్శిళ్లపై గతంలో అంతంత మాత్రంగా ఉండే కమీషన్‌ను ఇటీవల ఏజెన్సీలు పెంచాయి. ప్రస్తుతం లోకల్, లాంగ్ రూట్‌ను బట్టి ఒక్కో పార్శిల్ డెలివరీపై రూ.14 నుంచి రూ.20 వరకు కమీషన్ ఇస్తున్నాయి. వారం వారం పేమెంట్లు చేస్తున్నాయి. నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించుకోవచ్చునంటూ విస్తృతంగా ప్రచారం చేస్తూ నిరుద్యోగ యువతను ఆకర్షిస్తున్నాయి. డెలివరీ బాయ్స్‌కు బైక్, డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరి. ఒక్క భీమవరంలోనే 500 మందికిపైగా డెలివరీ బాయ్స్/ఏజెంట్లుగా సేవలు అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా డెలివరీ బాయ్స్ ఉంటారని అంచనా. అధిక శాతం మంది ఫుల్ టైమ్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారు. 5 శాతం వరకు మహిళలు కూడా డెలివరీ సర్వీస్ చేస్తున్నారు. రోజుకు 40 నుంచి 60 వరకు పార్శిళ్లు డెలివరీ చేయడం ద్వారా నెలకు 15 వేల నుంచి రూ. 20 వేలకు పైగా ఆర్జిస్తున్నారు.

ఫుడ్ డెలివరీ యాప్‌లతో పార్ట్‌టైం అవకాశాలు

ఒకప్పటిలా రెస్టారెంట్‌కు వెళ్లి తినడం, పార్శిల్ తెచ్చుకోవడమంటే ఇప్పుడు చాలా మంది పెద్ద పనిగా ఫీల్ అయిపోతున్నారు. మొబైల్‌లోని జొమాటో, స్విగ్గీ తదితర ఫుడ్ డెలివరీ యాప్‌పై ఒక క్లిక్ ద్వారా తమకు ఇష్టమైన రెస్టారెంట్ నుంచి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ చేసుకుంటున్నారు. దీంతో ఫుడ్ డెలివరీ సంస్థల సేవలు మారుమూల ప్రాంతాలకు విస్తరించాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి నిర్ణీత వేళల్లో ఫుడ్ ఆర్డర్లు ఉండటం వల్ల వీటిలో పార్ట్‌టైం జాబ్ అవకాశాలు ఉంటున్నాయి. ఆయా సమయాల్లో మూడు నాలుగు గంటల పాటు డోర్ డెలివరీ సర్వీస్ చేస్తూ ఆదాయం పొందుతున్నారు. పాకెట్ మనీగా పనికొస్తాయని విద్యార్థులు, డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను స్ఫూర్తిగా తీసుకుని డిగ్రీ, పైచదువులు చదివిన వారు సైతం డెలివరీ బాయ్స్‌గా చేస్తున్నారు. ఈ ఫుడ్ డెలివరీ యాప్‌లలో పని చేస్తున్న వారు మూడు వేల వరకు ఉండగా అధికశాతం మంది నిరుద్యోగ యువత, విద్యార్థులు ఉంటున్నారు. రోజుకు రూ. 500 నుంచి రూ.700 వరకు ఆర్జిస్తున్నారు.

ఇన్‌టైంలో అందిస్తేనే..



రెండు నెలల నుంచి డెలివరీ బాయ్‌గా చేస్తున్నాను. రోజుకు 40 నుంచి 50 వరకు పార్శిళ్లు డెలివరీ చేస్తుంటాను. ఇన్‌టైంలో ఆర్డర్ పెట్టిన వారికి పార్శిల్ డెలివరి చేయాలన్నదే మా టార్గెట్. అది రీచ్ అయితేనే ఆనందంగా ఉంటుంది.

– బి.అశోక్ కుమార్, వీరవాసరం

ఉరుకుల పరుగుల జీవితం



మూడేళ్ల నుంచి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాను. ఆర్డర్‌లో సూచించిన సమయానికి పార్శిల్ డెలివరీ చేయాలి. అందుకనే ఎండైనా వానైనా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఉరుకులు పరుగులు పెడుతూ పార్శిల్స్ అందజేస్తుంటాం.

– ఎం.సునీల్ కుమార్, డెలివరీ బాయ్, భీమవరం

ఇబ్బందులు ఉంటాయి



డెలివరీ చేసే సమయంలో ఆర్డర్ పెట్టిన వారు ఫోన్ నంబర్, అడ్రస్ సరిగా ఇవ్వకపోవడం వల్ల ఒక్కోసారి ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆర్డర్ డెలివరీ చేస్తేనే మాకు కమిషన్ వస్తుంది. లేకపోతే ఎంత తిరిగినా ఫలితం లేక నష్టపోతాం.

– పి.రమేష్, డెలివరీ బాయ్, పెన్నాడ

డీఎన్నార్ కళాశాలకు నాక్ ఏ ప్లస్



వివరాలు వెల్లడిస్తున్న డీఎన్నార్ యాజమాన్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని డీఎన్నార్ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు దక్కిందని కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు చెప్పారు. శనివారం కళాశాలలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నవంబర్ 28, 29 తేదీల్లో నాక్ సభ్యుల బృందం కళాశాలను పరిశీలించి సంతృప్తి చెందడంతో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ కేటాయించినట్లు చెప్పారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతూ తమ కళాశాలలో అన్ని సౌకర్యాలతోపాటు దివ్యాంగ విద్యార్థులకు ఫీజు మినహాయింపు, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఫీజు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగారాజు మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి తమ కళాశాలలో చదివే విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు ట్విన్నింగ్ ప్రోగ్రాం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ జి.మోజేస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక తనిఖీల్లో 832 కేసుల నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో కొనసాగుతున్న రవాణా శాఖ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారులు 832 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. డిసెంబరు 1 నుంచి శనివారం వరకు వివిధ రకాల వాహనాలపై ఉల్లంఘనలకు 832 కేసులు నమోదు చేసి రూ.14.92 లక్షలు అపరాధ రుసుం విధించామన్నారు.

మొక్కుబడిగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్

అంతగా హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులు

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం శనివారం తలపెట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)కు స్పందన కరువైంది. అన్ని స్కూళ్లలో అట్టహాసంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో అనేక పాఠశాలల్లో మొక్కుబడిగా ముగించారు.

జిల్లా వ్యాప్తంగా 1,430 స్కూళ్లలో

జిల్లా వ్యాప్తంగా 1,430 స్కూళ్లలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్ జరిపేందుకు స్కూళ్లను అలంకరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులేగాకుండా విద్యార్థుల హాజరు శాతం కూడా అనేక చోట్ల తక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో షష్ఠి పండుగ, సార్వా వరి మాసూళ్ల ముమ్మరంగా ఉండడంతో స్పందన అంతంతమాత్రంగానే ఉంది. కొన్నిచోట్ల అతి తక్కువ శాతం తల్లిదండ్రులు హాజరు కాగా కొన్నిచోట్ల మొక్కుబడిగా కన్పించి వెళ్లిపోయారు.



నరసాపురంలో తాడు లాగే ఆటను పరిశీలిస్తోన్న కలెక్టర్

విద్యార్థులతోనే పోటీలు

విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాల్సి ఉంది. తల్లిదండ్రుల హాజరుశాతం తక్కువగా ఉండడం, వచ్చిన కొద్దిమంది వెంటనే వెళ్లిపోవడంతో పోటీలు విద్యార్థులతోనే నిర్వహించారు. సమావేశాలకు పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా హాజరు ఉండాలని ఆదేశించడంతో కొన్ని స్కూళ్లకు పోలీసు అధికారులు, సిబ్బంది హాజరై విద్యార్థులతో కలిసి ఉన్నట్లు ఫొటోలు తీసుకోడానికి ఆరాటపడ్డారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాలి

నరసాపురం: ప్రభుత్వ పాఠశాలల వ్యవహారాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. నరసాపురం రాయిపేట ఎస్ఎస్ఎస్(లెనిన్)హైస్కూల్లో శనివారం మెగా పేరెంట్, టీచర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తమ పిల్లలు చదువుతున్న పాఠశాల బాగోగులపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని ఎస్పీ అయాం అస్మి సూచించారు. పిల్లలకు మంచి చెడులను వివరిస్తూ పెంచాలన్నారు. ముందుగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లి తండ్రులకు ముగ్గులు, తాడు లాగే ఆటలు నిర్వహించారు.

దాళ్వా సాగుకు సన్నద్ధం

- జిల్లాలో 2.25 లక్షల ఎకరాల్లో సాగు
- 60,625 కింట్వాళ్ల వరి విత్తనాలు అవసరం
- 48 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం



వీరవాసరం మండలం తోలకపూడిలో దాళ్వా వరి నారుమడి

భీమవరం: జిల్లాలో సార్వా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతుండగా మరో పక్క దాళ్వా సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. సార్వా సీజన్ ప్రారంభంలో అధిక వర్షాలు, వరదల కారణంగా అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్న రైతన్నలకు ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పంటల ప్రారంభంలో రైతు భరోసా పేరుతో ఆర్థిక సాయం అందించగా కూటమి ప్రభుత్వం రూ.20 వేలు సాయమందిస్తామని చెప్పి చేతులెత్తేసింది. జూన్‌లో వర్షాలు, వరదల కారణంగా నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్న రైతులకు ఇంతవరకు ఎలాంటి ప్రభుత్వ సాయం అందనే లేదు. అయినప్పటికీ వ్యవసాయమే జీవనాధారమైన రైతులు ప్రవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సార్వా పండించారు. పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉండడం, ధాన్యంలో తేమ శాతం పేరుతో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సివచ్చింది.

2.25 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు

సార్వా సాగులోని నష్టాలను కొంతైనా పూడ్చుకోవాలనే లక్ష్యంతో దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 2.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సివుండగా రైతులు ఎక్కువగా ఎంటీయూ 1121 రకం సాగుచేయడానికి మక్కువ చూపుతున్నారు. దీనికిగాను 60,625 కింట్వాళ్ల విత్తనాలు అవసరం కాగా రైతుల వద్దనే దాదాపు 50 వేల కింట్వాళ్లకు పైగా విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. వ్యవసాయ శాఖ 2 వేల కింట్వాళ్ల విత్తనాలు రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించడానికి సిద్ధం చేసింది.

నెలాఖరుకు మాసూళ్లు పూర్తి



ప్రస్తుత సార్వా మాసూళ్లు నెలాఖరుకు పూర్తి అవుతాయి. దాళ్వా నాట్లు జనవరి నాటికి పూర్తి చేసేలా రైతులను సన్నద్ధం చేస్తున్నాం. తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, వీరవాసరం, గణపవరం వంటి ప్రాంతాల్లో దాళ్వా వరి నారుమళ్లు ప్రారంభమయ్యాయి. సార్వా మాసూళ్లు చేసిన రైతులు వెంటనే దాళ్వా నారుమళ్లు వేస్తున్నారు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ఎరువులు సిద్ధం

జనవరి నెలాఖరుకు దాళ్వా వరినాట్లు పూర్తిచేసేలా సాగుకు అవసరమైన ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని గుర్తించగా 48 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. 16 వేల శాంపిల్స్ భూసార పరీక్షలు సేకరించగా వాటిలో 7 వేలు పరీక్షలు పూర్తి చేసి రైతులకు అందచేశారు.

ప్రయోగాత్మకంగా ఎస్ఎల్ఆర్ 3238 రకం

ఇప్పటి వరకు జిల్లాలో సాగులో ఉన్న ఎంటీయూ 1121 రకానికి ప్రత్యామ్నాయంగా సూపర్ ఫైన్ రకానికి చెందిన ఎస్ఎల్ఆర్ 3238 జింక్ బయోఫోర్ట్ వరి రకాన్ని రైతులకు పరిచయం చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రతి మండలంలో ఒక ఎకరం విస్తీర్ణంలో ఎస్ఎల్ఆర్ 3238 రకం వరి నాట్లు వేయించేందుకు విత్తనాలను పంపిణీచేస్తున్నారు.

కనుల పండువగా షష్ఠి తిరునాళ్ల

అత్తిలి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి తీర్ధ మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. ప్రత్యేక దర్శనానికి కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు కాలువలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీనాగేంద్రుని సర్పానికి మహిళలు పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులతో సంతానం కలిగిన దంపతులు తమ చిన్నారుల శిరస్సుపై నుంచి బూరెలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో షష్ఠి ఉత్సవాలకు హాజరైన వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవలందించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దాససాహిత్య ప్రాజెక్టుచే నిర్వహించిన కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తణుకు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. తిరునాళ్లలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వద్ద సందడి నెలకొంది. దుకాణాల వద్ద సామగ్రిని కొనుగోలు చేసేందుకు మహిళలు బారులు తీరారు.



విశేష అలంకరణలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి



షష్ఠిలో కిటకిటలాడుతున్న భక్తజనం

క్లుప్తంగా

గోవధ నిషేధించాలని ఆందోళన



ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న గో సేవా సమితి సభ్యులు, స్థానికులు

తణుకు టౌన్ : తేతలిలోని లేహ్యా ఫుడ్ ఫ్యాక్టరీ వద్ద గో సేవా సమితి సభ్యులు, స్థానికులు శనివారం ఆందోళన నిర్వహించారు. గేదెలను ఫ్యాక్టరీలోకి తీసుకువెళుతున్న రెండు వ్యాన్లను అడ్డుకున్నారు. దీనిపై యాజమాన్యం స్పందించకపోవడంతో గేదెలతో ఉన్న వ్యాన్లను తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అఘోరా అఖడా జాతీయ ఉపాధ్యక్షుడు రాజేష్ నాథ్ జీ అఘోరీ విలేకరులతో మాట్లాడారు. లేహ్యా ఫుడ్ ఫ్యాక్టరీ వలన పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీలో గోవులు, గేదెలను వధించడం వలన వచ్చే వ్యర్థాలు, రసాయనాలతో కూడిన నీరు తీవ్ర ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోయారు. గోసేవా సమితి నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా గోవధ నిర్వహిస్తున్న పరిశ్రమ యాజమాన్యంపై, ఈ పరిశ్రమకు అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోసేవా సమితి సభ్యులు సత్తిరాజు వెంకట సుబ్రహ్మణ్యం, ఆర్ఎస్ఎస్ నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస రాజా, జీ శ్రీనివాసు, సురేష్ బాబు గంధం, సూరిపండు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



రేషన్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

భీమవరం(ప్రకాశంచౌక్) : పట్టణంలోని మెంటేవారి తోటలో శనివారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్ది వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసినట్లు గుర్తించామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. బియ్యాన్ని, ఎలక్ట్రానిక్ కాటాను, సంచులను సీజ్ చేశామన్నారు. బియ్యం విలువ రూ.2.60లక్షలు ఉంటుందన్నారు. వెంకట సుబ్బయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఎస్ ఆర్ఐ సురేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



తణుకులో సినీ నటి సందడి

సినీ నటి మీనాక్షి చౌదరి శనివారం తణుకులో సందడి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. నటనపై ఉన్న మక్కువతో చిత్ర పరిశ్రమకు వచ్చినట్లు చెప్పారు. గుంటూరు కారం, లక్కీభాస్కర్ చిత్రాలు తనకు గుర్తింపు తెచ్చిపెట్టాయన్నారు. త్వరలో నటుడు వెంకటేష్ సరసన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఒక తమిళ సినిమాతో పాటు రెండు తెలుగు సినిమాలకు డేట్స్ కుదిరాయని చెప్పారు.

– తణుకు అర్బన్



మారుతికి విభూది అలంకరణ

మహాశివుని అవతారంగా భావించే ఆంజనేయస్వామికి విభూది అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భీమవరం మారుతీ టాకీస్ సెంటర్‌లోని శ్రీదాసాంజనేయ స్వామివారికి శనివారం ఆలయ ఈవో గొట్టుముక్కల నాగ సీతారామరాజు పర్యవేక్షణలో అర్చకులు ఘంటసాల పవన్ కుమార్ పంచామృతాలతో అభిషేకాలను జరిపారు. అనంతరం స్వామివారిని 15 కేజీల విభూదితో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.

– భీమవరం (ప్రకాశంచౌక్)

కూటమి నేతల అడ్డగోలు ఆందోళనలు

- మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద 'వంటావార్పు'
- చెరువుల లీజు సొమ్ము చెల్లించాలంటూ నిరసనలు
- అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి (టాస్క్‌ఫోర్స్) : కూటమినేతలు అడ్డగోలు ఆందోళనలకు తెరతీశారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిపై అసత్య ఆరోపణలు చేస్తూ ఆయన ఇంటి వద్ద నిరసనలకు దిగారు. దీనిని వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుకున్నారు. దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన అబ్బయ్యచౌదరిపై కక్షపూరిత రాజకీయాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏలూరు రూరల్ మండలం కోమటిలంక కూటమి నేతలు శనివారం కొండలరావుపాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పాలనలో అబ్బయ్యచౌదరి దాదాపు 230 ఎకరాల్లో చేపల చేరువులు తవ్వారని, దీనికి సంబంధించి దాదాపు 5 కోట్ల వరకు లీజు సొమ్ము రావాలని, ఆ సొమ్ములు చెల్లించేవరకు ఇక్కడ నుంచి కదలమని కూటమి నేతలు నిరసన వ్యక్తం చేశారు. దీనిని వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నూజివీడు డీఎస్పీ ఎస్వీవీ ప్రసాద్, పెదవేగి సీఐ కె వెంకటేశ్వరరావు, పెదవేగి ఎస్సై కె రామకృష్ణ, దెందులూరు ఎస్సై శివాజీ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టి పరిస్థితిని అదుపు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న దెందులూరు నియోజకవర్గంలో కూటమి నేతలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. చెరువుల లీజుకు సంబంధించిన సొమ్ము ఎప్పటికప్పుడే తీసుకుని అన్యాయంగా అబ్బయ్యచౌదరిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.





మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద భద్రతా చర్యలు చేపట్టిన పోలీసులు, కొండలరావుపాలెంలో కూటమి నేతలు వంటావార్పు నిర్వహిస్తున్న దృశ్యం

ఇలాంటి చర్యలు దుర్మార్గం



లంక గ్రామాలను ఊహించని రీతిలో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికే దక్కింది. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభాకర్ కక్షపూరితంగా కొందరు అమాయకులను ప్రేరేపించి గత రెండు రోజులుగా అబ్బయ్యచౌదరి ఇంటి ముందు ఆందోళనలు చేయిస్తున్నారు. ఇది దుర్మార్గం.

– జానంపేట బాబు
వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

కూటమిది నీచ సంస్కృతి



వైఎస్సార్ సీపీ పాలనలో కొల్లేరు ప్రజలు ఎన్నడూ ఇబ్బంది పడడం నేను చూడలేదు. నేడు మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు కూటమి నేతలు నిరసనలకు దిగడం నీచ సంస్కృతి. ఏదైనా సమస్య ఉంటే న్యాయపరంగా పరిష్కరించుకోవాలి గానీ ఇలా ఇళ్ల మీదకు వచ్చి ధర్నాలు, నిరసనలు చేయడం తగదు.

– ముంగర సంజీవ్‌కుమార్
పైడిచింతపాడు వడ్డీల నాయకుడు

లీజు సొమ్ములు మొత్తం ఇచ్చేశాం



వైఎస్సార్ సీపీ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా లంక గ్రామాలకు చెందిన ప్రతి ఒక్కరికీ చెరువుల లీజు సొమ్ములు క్రమం తప్పకుండా అందించారు. కోమటిలంకలో ఉన్న చెరువుల నిమిత్తం లీజు సొమ్ము శ్రీపర్రు గ్రామ కచేరసావిడి దగ్గర పెద్దల సమక్షంలో ఇచ్చాం. ఇందుకు నేను, ప్రస్తుత కూటమి నాయకులే సాక్ష్యం.

– పల్లెం ప్రసాద్, మాజీ స్టేట్ ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్, కొల్లేరు

చట్టాలు, శిక్షలపై అవగాహన తప్పనిసరి

పెదవేగి : చట్టాలు, శిక్షలపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలని ఒంగోలు సెషన్ జిల్లా జడ్జి దున్న రాములు అన్నారు. కథోలిక న్యాయవాదుల జాతీయ సదస్సును శనివారం పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో సదస్సు జాతీయ అధ్యక్షుడు ఫాదర్ సంతానం, ఎస్‌జీ ఆర్సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఒంగోలు సెషన్ జిల్లా జడ్జి దున్న రాములు మాట్లాడుతూ న్యాయవాదులు పేదలకు న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. మరో అతిథి మద్రాస్ హైకోర్టు సీనియర్ కౌన్సిల్ హైజెక్ మోహన్లాల్ మాట్లాడుతూ మైనార్టీ హక్కులపై సుదీర్ఘంగా వివరించారు. కర్ణాటక హైకోర్టు అడ్వకేట్ రాబిన్ కృష్ణఫర్ మాట్లాడుతూ మతమార్పిడి నిరోధక చట్టం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ కథోలిక న్యాయవాదులు గురువులు, కన్యస్త్రీలు పేదలకు న్యాయం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. జాతీయ సదస్సులో స్టేట్ కన్వీనర్ ఫాదర్ డి.స్లీవరాజ్, కౌన్సిల్ డయాసిస్ లీగల్ కన్సల్టెంట్ అడ్వకేట్ రోనాల్డ్ రాజు, ఫాదర్ బాబు ఫ్రాన్సిస్, సుపీరియర్ సిస్టర్ ఝాన్సీ, ప్రొవెన్షనల్ సిస్టర్ స్నేహగిల్ ఫాదర్ అనుక్షణ, కథోలిక న్యాయవాదులు కన్యస్త్రీలు గురువులు హాజరయ్యారు. ఈ జాతీయ సదస్సు ఆదివారంతో ముగుస్తుందని పీఆర్ఓ ఫాదర్ టి ఇమ్మానియేల్ తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణ బృందం సభ్యులు ఫాదర్ పి బాల, ఫాదర్ జి మోజెస్, ఫాదర్ ఇంజేపాల్, ఫాదర్ జాకబ్, ఫాదర్ బాబు జార్జి పాల్గొన్నారు.



న్యాయవాదుల జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న బిషప్ పొలిమేర జయరావు



పాల్గొన్న న్యాయవాదులు

దాళ్వా సాగులో సస్యరక్షణ చర్యలపై శిక్షణ

ఏలూరు(మెట్రో) : దాళ్వా సాగులో ఎంపిక చేసుకోవాల్సిన వంగడాలు, పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ పరిశోధనా స్థానం – విజయరాయి, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా సంస్థ, విజయరాయి అధిపతి డా. కె.మోహనరావు, ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డా.కె.ఫణికుమార్ మాట్లాడుతూ దాళ్వా సాగుకు నూతన వరి రకాలు, మినుము, పెసరలో నూతన వంగడాలు, మొక్కజొన్నలో కత్తెర పురుగు యాజమాన్యం, వివిధ పంటల్లో కలుపు, ఎరువులు, పురుగు, తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డా. పీవీ రమణారావు నూతన వరి వంగడాల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు అందించిన సూచనలను రైతులకు చేరవేసి వారు అధిక దిగుబడులను సాధించేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే బాషా, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శైలజ వ్యవసాయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో లలిత సుధ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్.నాగేంద్ర బాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల : కల్యాణమూర్తులకు హారతులిస్తున్న అర్చకులు



తాడేపల్లిగూడెం రూరల్ : మొదుగగుంటలో కృత్రిమ పుట్ట వద్ద చిన్నారుల సందడి



పెంటపాడు : విప్పర్రులో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుడు




పెనుగొండ: వడలిలో పూజలందుకున్న సుబ్బారాయుడు

షష్ఠి సంబరం

సుబ్బారాయుడి షష్ఠి మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పలుచోట్ల పుట్టలలో పాలు పోసి స్వామిని ప్రార్థించారు. కల్యాణమూర్తులను రథోత్సవంలో ఊరేగించి అనంతరం తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయాల వద్ద తిరునాళ్లు కోలాహలంగా జరిగాయి.

– సాక్షి, నెట్‌వర్క్



పెంటపాడు : విప్పర్రులో ఆలయ ఆవరణలో దుకాణాల వద్ద సందడి



ఆకివీడు : స్వామివారికి వైభవంగా తెప్పోత్సవం



పాలకొల్లు అర్బన్ : పెదమామిడిపల్లిలో రథోత్సవం



నరసాపురం రూరల్ : లిఖితపూడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

జూదాలు వద్దు.. జీవితం నాశనం చేసుకోవద్దు

ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



చింతలపూడి: జూదాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ యువతకు హితవు పలికారు. చింతలపూడి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూదాలకు అలవాటు పడి కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. జూదాల వల్ల కుటుంబాలు నష్టపోవడమేకాక విద్యార్థులపై కూడా ప్రభావం పడుతుందని, కాబట్టి వాటికి దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో రవాణా అవుతున్న గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఫేక్ వీడియో, ఆడియోల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. ఆశకు పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని జిల్లా ప్రజలకు సూచించారు. పోలీస్ శాఖ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని చెప్పారు. అనుమానం వస్తే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సమాచారం అందించాలని సూచించారు.

నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ దాడులు

చింతలపూడి : నాగిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని సీఐ పి.అశోక్ తెలిపారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

బుట్టాయగూడెం : జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో తెలంగాణ మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. గ్రామంలో శనివారం తనిఖీలు నిర్వహించగా 25 సుంకం చెల్లించని మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పల్గొన్నట్లు తెలిపారు.

సహజ వనరులను వివేకంగా వినియోగించాలి

ఏలూరు(మెట్రో): ప్రస్తుత ప్రజల కనీస అవసరాలు తీరుస్తూ, భవిష్యత్తు తరాల కొరకు వనరులను మిగులుస్తు సహజ వనరులను వివేకముగా వినియోగించేది సుస్థిరత అని ఏపీఎస్ఐఆర్‌డీ పీఆర్ జేడీ జి.రమణ అన్నారు. ఏలూరులోని డీపీఆర్‌సీలో రెండు రోజులుగా 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై' నిర్వహిస్తున్న ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణ శిక్షకులకు పలు సూచనలు చేశారు. మానవ మనుగడకు ఎదురవుతున్న అసమానతలు తొలగించటం ద్వారా సామజిక సుస్థిరత సాధించవచ్చన్నారు. జిల్లా పరిషత్ సీఈవో డాక్టర్.ఆర్.విజయరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం కల్పించుటకు కృషి చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌డీవో ఎం.రాజు, డీపీఆర్‌సీ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గుత్రాల ప్రసంగి రాజు మాట్లాడుతూ ఈ నెల 12 నుండి 18 వరకు గ్రామ సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ, డీఎల్‌డీవో వై.దోసిరెడ్డి, ఏబీవీపీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జీడీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజు, పీఎం ఈ.అనిత, టి.నాగేశ్వరరావు, ఆరోగ్యశాఖ నుంచి రోజ్‌మేరీ, పి.కృష్ణకిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి ఆర్‌కే వర్మ, చింతమనేని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీ పీఆర్ జేడీ జి.రమణ

క్లుప్తంగా

చలో విజయవాడను జయప్రదం చేయండి



ఆరుగొలనులో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్‌: పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదిన నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ సీపీఎస్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ మండల ఇన్‌చార్జ్‌ ఎల్‌. మహేష్‌ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో చలో విజయవాడ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన పెన్షన్‌ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్‌ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్‌ ఉద్యోగులు పాల్గొన్నారు.

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



తణుకు పైడిపర్రు సర్కిల్‌లో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్‌: మాదక ద్రవ్యాలను స్వీకరించడం వల్ల ఇల్లు, ఒళ్లు గుల్ల అవుతుందని, ప్రాణాలను పోగొట్టే వ్యసనాల్ని మానాలని తణుకు ఎక్సైజ్‌ సీఐ ఎస్‌ మణికంఠ రెడ్డి చెప్పారు. శనివారం సాయంత్రం తణుకు పైడిపర్రు సర్కిల్‌లో తణుకు ఎక్సైజ్‌, అండ్‌ ప్రొహిబిషన్‌ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర డ్రగ్స్‌ సేవించేవారి యొక్క ఆరోగ్యపరమైన, ప్రవర్తన పరమైన మార్పుల ఆధారంగా శరీర బాగాలపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. ఈ వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి ఏవిధంగా ప్రవర్తించాలనే అంశాలను వివరించారు. గంజాయి నిర్మూలనకు ప్రభుత్వ తీసుకొచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గంజాయి నిర్మూలనలో భాగస్వాములు చేసేలా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌ ఎస్‌ఐ బీ లక్ష్మీ, హెచ్‌సీలు కె శ్రీనివాసు, అప్పలస్వామి, ఫణిభూషన్‌ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: స్వాంతంత్ర్య సమరయోధుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు తాడేపల్లి ముసలయ్య వర్ధంతి వేడుకలు శనివారం పెంటపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌లు ముసలయ్య సేవలను కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా, స్వాంతంత్ర్య సమరయోధునిగా తాడేపల్లి ముసలయ్య సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లి మోహనరావు, సూర్యచంద్రకుమారిలు 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యవర్గ సభ్యులు దేవాబత్తుల శామ్యూల్‌రాజు, నక్కా సాంబశివరావు, పోలుమాటి జయరాజు, విప్పర్తి వినాయకుడు, మానుకొండ మార్కు, తాడేపల్లి ముసలయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత





- అధ్వానంగా రహదారులు
- పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు





టీటీడీ కల్యాణ మండపం రహదారిలో మసీద్‌ సెంటర్‌ నుంచి గుణ్ణం ఫంక్షన్‌ హాల్‌ వరకు వెళ్లే రహదారిలో గోతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులు గోతులమయంగా మారాయి. ఆ రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అడుగుకో గుంత...గజానికో గొయ్యి ఉండడంతో రాకపోకలకు నరకం చూస్తున్నారు. గోతుల వల్ల ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. కనీసం ప్యాచ్‌ వర్క్‌లైనా చేయాలని కోరుతున్నారు. మొదటి ఫ్లైఓవర్‌ నుంచి టీటీడీ కల్యాణ మండపానికి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో పెద్ద మసీద్‌ వద్ద నుంచి గుణ్ణం ఫంక్షన్‌ హాల్‌ వరకు పలు చోట్ల గుంతలు, గొయ్యిలు పడ్డాయి. గత 6 నెలలు నుంచి ఈ రహదారి మరింత అధ్వానంగాను, ప్రమాదకరంగాను మారింది. గోతులు, గొయ్యిలతో పాటు రాళ్లుపైకి లేచి స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఈ రహదారి మార్గం గుండా ఏరియా ఆసుపత్రికి, టీటీడీ కల్యాణ మండపంనకు, నిట్‌ కళాశాలకు, మండలంలోని వివిధ రూరల్‌ గ్రామాలు కుంచెనపల్లి, టిడ్కో ఇళ్ల వద్దకు, ఆయా ప్రాంతాలకు ప్రధాన రహదారిగా ఉంది. నిత్యం ఈ మార్గం గుండా ఆటోలు, స్కూల్‌ బస్సులు, కారులు, బైక్‌లు, పాల వ్యాన్లు, ఇతర వామనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. దీంతో ఈ మార్గం రద్దీగా మారింది. గోతులు, గుంతలు కారణంగా వాహనదారులు పలు ఇక్కట్లు పడుతున్నారు. పలు మార్లు బైక్‌లు స్కిడ్‌ అవుతున్నాయని, బైక్‌ నుంచి పడిపోవడం, గాయాలు పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గోతులు కారణంగా ఒళ్లు హూనం అవుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు సైతం ఈ మార్గంలో ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని అంటున్నారు. మునిసిపల్‌ అదికారులు స్పందించి ఈ మార్గానికి అత్యవసరంగా ప్యాచీ వర్కులు చేయించాలని, పర్మినెంట్‌గా రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.

రహదారి మార్గంలో గుంతలు పూడ్చండి



మసీద్‌ సెంటర్‌ నుంచి గుణ్ణం ఫంక్షన్‌ హాల్‌ వరకు రోడ్డు మార్గంలో భారీగా గుంతలు, గొయ్యిలు పడ్డాయి. బైక్‌లు స్కిడ్‌ అవుతున్నాయి. బైక్‌దారులు పడిన ఘటనలు, ఆసుపత్రుల పాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలికంగా రోడ్డు మార్గంలో పడిన గొయ్యిలు పూడ్చాలి. ఈ రహదారిని శాశ్వత ప్రాతిపదికన తిరిగి నిర్మించాలి

– ఎస్‌కే హనీఫ్‌, తాడేపల్లిగూడెం

రైతులు దళారులను నమ్మొద్దు

జేసీ టీ రాహుల్‌ కుమార్‌ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ టీ రాహుల్‌ కుమార్‌ రెడ్డి

తణుకు టౌన్‌: రైతులు దళారులను నమ్మొదని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ టీ రాహుల్‌ కుమార్‌ రెడ్డి తెలిపారు. తణుకు మండలంలో ధాన్యం కొనుగోలుకు రైతులకు అవసరమైన లక్ష గోనె సంచులను రైస్‌ మిల్లర్ల ద్వారా అన్ని రైతు సేవా కేంద్రాలకు అందజేసినట్లు ఆయన తెలిపారు. శనివారం తణుకు తహసీల్దార్‌ కార్యాలయంలో రైస్‌ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైస్‌ మిల్లర్ల నుంచి సేకరించిన లక్ష గోనె సంచులను అన్ని రైతు సేవా కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. ఖరీఫ్‌ ధాన్యం చివరి దశకు వచ్చిందున మరో 75 వేల గోనె సంచులను రెండు రోజుల్లో అన్ని రైతు సేవా కేంద్రాలకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో, తహసిల్దార్‌ డీవీఎస్‌ఎస్‌ అశోక్‌ వర్మ, రైస్‌ మిల్లర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలి

పెనుగొండ: మన దేవాలయాలను మనమే నిర్వహించుకోవాలనే సంకల్పంతో దేవాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి కోసం విశ్వ హిందూ పరిషత్‌ ఆధ్వర్యంలో జనవరి 5న నిర్వహించే హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్‌ గోదావరి విభాగ్‌ కార్యకారిణి సభ్యులు చింతాకుల గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. శనివారం సిద్ధాంతంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ ఐక్యత శక్తిని నిరూపించే మహాఉద్యమంలో పెనుగొండ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా చేయడం కోసం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సిద్ధాంతం విజయగోపాల స్వామి దేవస్థానంలో హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశామని తెలిపారు.

మధ్యవర్తిత్వ చట్టంపై అవగాహన



తణుకు : మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి



తాడేపల్లిగూడెం టీఓసీ : మాట్లాడుతున్న షేక్‌ సికిందర్‌ బాషా

తణుకు అర్బన్‌: కేసుల పరిష్కారంలో న్యాయపరంగా ఇరువర్గాలకు సమన్యాయం జరిగేలా చేయడం కీలకమని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్‌, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు బార్‌ అసోసియేషన్‌ భవనంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ కేసులకు సంబంధించి న్యాయసేవల చట్టం ప్రకారం మధ్యవర్తిత్వం ఎవరితో జరిపించాలి, ఏయే కేసుల్లో మధ్యవర్తిత్వం చేయాలనే అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. మధ్యవర్తిత్వం రిసోర్స్‌ పర్సన్స్‌గా రెండవ అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి ఏవీ నాగరాజు బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులకు చట్టంపై అవగాహన కల్పించారు. అసోసియేషన్‌ కార్యదర్శి ఈదా రామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా న్యాయ సేవా సంస్థ ఆదేశాలు మేరకు తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్‌ సర్వీసెస్‌ కమిటీ చైర్మన్‌ షేక్‌ సికిందర్‌ బాషా అధ్యక్షతన స్థానిక బార్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో శనివారం మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ క్రిమినల్‌, సివిల్‌ కేసులలో మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసి కేసుల నుంచి కక్షిదారులకు విముక్తి కలిగించాలని న్యాయవాదులకు వివరించారు. తద్వారా కోర్టులపై పని వత్తిడి కొంత మేరకు తగ్గుతుందని, ఇరు పార్టీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. 1వ అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి డి.అరుంధతి మాట్లాడుతూ సమస్యలను గుర్తించడం, వాటికి తగిన పరిష్కారం చూసించడం, ఇరువర్గాలకు సయోధ్య కుదిర్చి రాజీ చేయాలన్నారు. బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డీవీ విజయకుమార్‌, శిరిగినీడి విజయకృష్ణ, జీవీ ద్వారకానాథ్‌లు మాట్లాడారు. బార్‌ అసోసియేషన్‌ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పారా లీగల్‌ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం కోర్టు పరిధిలోని 7 మండలాల నుంచి పారా లీగల్‌ వలంటీర్లు (న్యాయసేవా సహాయకులు)గా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్‌ సర్వీస్‌ కమిటీ చైర్మన్‌ షేక్‌ సికిందర్‌ బాషా పేర్కొన్నారు. బార్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో సికిందర్‌ బాషా మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర న్యాయసేవా సహాయ సంస్థ అమరావతి, జిల్లా న్యాయసేవా సహాయ సంస్థ చైర్మన్‌, ప్రధాన జిల్లా జడ్జి వారి ఆదేశాలు మేరకు తాడేపల్లిగూడెం కోర్టు పరిధిలోని 7 మండలాలు నుంచి పారా లీగల్‌ వలంటీర్లు (న్యాయ సహాయకులు)గా పనిచేయుటకు ధరఖాస్తులు స్వీకరించన్నుట్లు వెల్లడించారు. రిటైర్డు ఉపాధ్యాయులు, లెక్చరర్స్‌, సీనియర్‌ సిటిజన్స్‌, సోషల్‌ వర్క్‌ స్టూడెంట్స్‌, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, న్యాయ విద్య అభ్యసించే విద్యార్థులు, ఎన్జీవోస్‌, రోటరీ క్లబ్‌, లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పారా వలంటీర్లుగా దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

షష్ఠి మహోత్సవం.. ఊరంతా వైభవం



తణుకులో విశేషాలంకరణలో పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



తాడేపల్లిగూడెం రూరల్‌: నవాబుపాలెం గ్రామంలోని సుబ్బారాయుడిని దర్శించుకున్న రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వడ్డి రఘురామ్‌నాయుడు

సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

తణుకు అర్బన్‌: షష్ఠి సందర్భంగా తణుకు సుబ్రహ్మేశ్వరుడి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రీనటరాజ సీతారామ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము 3 గంటల నుంచి భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కలుగజేయడంతో భక్తులు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను క్యూలైన్‌లో పంపించే విధంగా దేవాదాయధర్మాదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈవో జానకిరామరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు అల్లవరపు వెంకట కేదార కపర్ది ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో సుబ్బారాయుడి షష్ఠి వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్‌: మండలంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మోదుగ గుంట గ్రామంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, జెయింట్‌ వీల్‌, ఆట పరికరాల వద్ద చిన్నారులు సందడి చేశారు. అలాగే కడియద్ద, పట్టింపాలెం, అప్పారావుపేట, జగన్నాథపురం, కృష్ణాయపాలెం, నందమూరు, దండగర్ర, మాధవరం, నీలాద్రిపురం తదితర గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సుబ్బారాయుడి ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా కలగాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వడ్డి రఘురామ్‌ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆయన దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తుల సందడితో గ్రామాలు కోలాహలంగా మారాయి.

తాడేపల్లిగూడెం (టీఓసీ): సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి పాతూరులోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. నాగేంద్రస్వామి విగ్రహాలకు పాలతో అభిషేకాలు చేశారు.

శివాలయంలో విశేష పూజలు:

స్థానిక పెద్ద శివాలయంలోని శ్రీ భమరాంబిక మల్లిఖార్జునస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణగా నాగేంద్ర స్వామి అలంకరణ చేశారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక కడకట్ల, నందిబొమ్మ, గణేష్‌ నగర్‌, శ్రీ వాసవి ఇతర శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వేడుకలు

పెంటపాడు: మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఉత్సవాలు పలు గ్రామాలలో శుక్రవారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. పడమరవిప్పర్రులో వల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరావు ఆధ్వర్యంలో సుమారు 20 వేలమందికి అన్నసమారాధన చేశారు. అర్చకులు కొడవటిగంటి వేంకట నరసింహాచార్యులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. పెంటపాడు మిడ్‌లెవిల్‌ కాలువగట్టున శివాలయంలో ఉన్న సుబ్రహ్మణేశ్వర స్వామికి పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సభ్యులు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, కమిటీ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమామహేశ్వరం, దర్శిపర్రు, కె. పెంటపాడులో, బోడపాడు, వల్లూరిపల్లి, చింతపల్లి, రావిపాడు, అలంపురం, రాచర్ల, ప్రత్తిపాడు గ్రామాలతో పాటు పలు గ్రామాలలో సుబ్రహ్మణ్యేశ్వరుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఇష్టంగా విద్యనభ్యసించాలి

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో జేసీ రాహుల్‌కుమార్‌



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌, ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్‌: విద్యార్థి దశలో ఇష్టంతో చదివే విద్య భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ రాహుల్‌కుమార్‌ అన్నారు. తణుకు జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏకాగ్రతతో అభ్యసించే చదువు ఆ విద్యార్థిని ఉన్నత స్థాయికి చేరుస్తుందనే విషయాన్ని విద్యార్థులు, తల్లితండ్రులు గమనించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్వ విద్యార్థిగా హాజరైన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మంచి విద్య ఆ కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తుందని అన్నారు. ఆర్డీవో కె.కాసర్‌ ఖానో, డీఎస్పీ విశ్వనాథం, తహసిల్దారు డీవీఎస్‌ అశోక్‌వర్మ, ఎంఈవో వి.హైమావతి, ఏపీసీ శ్యామ్‌సుందర్‌, పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి కె మురళీకృష్ణ అన్నారు. శనివారం అత్తిలి మండల పరిషత్‌ ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీకే విజయ్‌కుమార్‌ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీఓ పి శామ్యూల్‌, ఎంఈవో ఎంఎల్‌కే ప్రసాద్‌, ఈఓఆర్డీ శ్రీనివాస్‌, విద్యాకమిటీ చైర్మన్‌ హేమంత్‌ ఆదినారాయణ, పాల్గొన్నారు.

చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

పెంటపాడు: విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం పాఠశాలలో మెగా పేరెంట్స్‌ మావేశం నిర్వహించారు. పెంటపాడు బేసిక్‌స్కూల్‌ తహసీల్దార్‌ ఏడిద శ్రీనివాస్‌, సీఐ రమేష్‌లు పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రాజేష్‌, పేరేంట్స్‌ కమిటీ అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావనరులను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యావనరులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ ఎం.సునీల్‌కుమార్‌ అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్‌ బీఆర్‌.అంబేడ్కర్‌ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రూరల్‌ ఎస్సై జేవీఎస్‌.ప్రసాద్‌, ఎంఈవో–2 పీఎం కే.జ్యోతి, ఎస్‌ఎంసీ చైర్మన్‌ ప్రకాస్‌కుమార్‌, వైస్‌ ప్రిన్సిపల్‌ ప్రతాప్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే మోదుగ గుంట జెడ్పీహెచ్‌, మారంపల్లి జిల్లా పరిషత్‌, ఆరుగొలను గురుకులం, మాధవరం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలోని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తణుకు టౌన్‌: పాఠశాలలో చదివే విద్యార్థుల తీరుతెన్నులను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం విద్యార్థుల ప్రగతిని తెలుసుకోగలమని ఎంపీడీవో ఆర్‌ లోహిత్‌ జయసాగర్‌ చెప్పారు. శనివారం తణుకు రూరల్‌ మండలం దువ్వ గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పట్టణంలో మెగా పేరెంట్స్‌, టీచర్స్‌ సమావేశాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో అన్ని పాఠశాలలో మెగా పేరెంట్స్‌ టీచర్స్‌ సమావేశాలు ఘనంగా జరిగాయి. స్థానిక సంజీవనగర్‌ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బ్రహ్మం అధ్యక్షతన చదువుల పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు హాజరైయారు. సంజీవనగర్‌ ప్రాథమిక పాఠశాల, స్థానిక 5వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో టీచర్స్‌ సమావేశాలు నిర్వహించారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

పాలకొల్లు సెంట్రల్‌: గ్రంథాలయాలు అనేవి విజ్ఞాన భాండాగారాలని వాటిని ఎంత ఉపయోగించుకుంటే అంత విజ్ఞానం పెరుగుతుందని తహసీల్దార్‌ వై.దుర్గాకిశోర్‌ అన్నారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను తహసీల్దార్‌ అందజేశారు. ఈ సందర్భంగా దుర్గా కిషోర్‌ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ విద్యే పెద్ద ఆస్తి అని ఎంత చదువుకుంచే అంత పదునైన జ్ఞానాన్ని అందించేది విద్యేనని అన్నారు.